వరికోతలు షురూ..

- పనుల్లో రైతులు నిమగ్నం
- హార్వెస్టర్లతో కోతలు



బెల్లంపల్లి: వానాకాలం సీజన్‌లో సాగైన వరిపంట కోతలు ప్రారంభమయ్యాయి. పంట ప్రస్తుతం చేతికి రావడంతో రైతులు కోతలు చేపట్టారు. మరో పక్షంరోజుల్లో పూర్తిస్థాయిలో పంట చేతికంది వరికోతలు ముమ్మరం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో భీమిని, బెల్లంపల్లి వ్యవసాయ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో ఏడు మండలాలు ఉండగా వానాకాలంలో ఈసారి 34,926 ఎకరాల్లో రైతులు వరినాట్లు వేసుకున్నారు. నెన్నెల మండలంలో అత్యధికంగా 7,707 ఎకరాల్లో వరి సేద్యం చేయగా అత్యల్పంగా కాసిపేట మండలంలో 1,919 ఎకరాల్లో పంట సాగు చేశారు. బోర్లు, సాగునీటి సౌకర్యంతో సాగుచేసిన వరి ప్రస్తుతం కోత దశకు చేరుకుంది. వేమనపల్లి, భీమిని, కన్నెపల్లి, నెన్నెల, తాండూర్, కాసిపేట మండలాల్లో క్రమంగా కోతలు ప్రారంభమయ్యాయి. హార్వెస్టర్లతో కోతలు చేపడుతున్నారు. చిన్నచిన్న కమతాలు ఉన్న రైతులు కూలీలతో కోతలు చేపడుతున్నారు. సరిగ్గా ఇదే సమయంలో పత్తి సేకరణ పనులు ప్రారంభం కావడంతో కూలీల సమస్య ఏర్పడుతున్నట్లు రైతులు చెబుతున్నారు.

నీటి తడులు సరిగా అందక..

అసెంబ్లీ నియోజకవర్గంలో సాగునీటి ప్రాజెక్టులు లేవు. తరాల నుంచి రైతులు వర్షాధారంపైనే ఆధారపడి వరి సేద్యం చేస్తున్నారు. పూర్తిగా ప్రకృతిపైనే ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. మారుతున్న కాలానుగుణంగా పొలాల్లో బోర్లు వేయించి విద్యుత్ సౌకర్యంతో పంటలు పండిస్తుండగా మెజార్టీ రైతులు వరుణుడిపైనే భారం పెట్టుకుంటున్నారు. ఈసారి అక్టోబర్ నాటికే వర్షాలు పూర్తిగా తగ్గుముఖం పట్టాయి. ఈ కారణంగా చెరువులు, కుంటల ఆధారంగా సాగుచేసిన పంటకు నీటితడులు సరిగా అందని పరిస్థితులు ఏర్పడ్డాయి. నీటి కష్టాలు ఎదురవ్వడంతో పంట దిగుబడి సరిగా వచ్చే అవకాశాలు లేవని రైతులు పేర్కొంటున్నారు. అక్కడక్కడ చెరువు, కుంటల కింద ఆయకట్టు చివరి భూములకు నీళ్లందక వాగుల్లో మోటార్లు పెట్టి కష్టంగా ఒకటి, రెండు తడులు అందించినా ప్రతికూల పరిస్థితులు ఉత్పన్నయయ్యాయి.

హార్వెస్టర్లే కీలకం..

వరికోతల్లో హార్వెస్టర్లు కీలకపాత్ర పోషిస్తున్నాయి. కూలీల అవసరం లేకుండానే హార్వెస్టర్లు వరికోతలు చేస్తున్నాయి. అయితే పెరుగుతున్న డీజిల్, పెట్రోల్ ధరలకనుగుణంగా హార్వెస్టర్ల అద్దె ధరలను యాజమానులు ఏటా పెంచుతుండటంతో రైతులపై ఆర్థికభారం పడుతోంది.

నియోజకవర్గ వ్యాప్తంగా..	
మండలం	వరిసాగైన ఎకరాలు
నెన్నెల	7,707
కన్నెపల్లి	7,287
వేమనపల్లి	5,735
బెల్లంపల్లి	4,902
తాండూర్	3,900
భీమిని	3,475
కాసిపేట	1,919

పంట ఆశాజనకంగా ఉంది



గ్రామాల్లో చాలామటుకు వరి ఆశాజనకంగా ఉన్నాయి. అక్కడక్కడ కొద్దిపాటిగా పంటకు చీడపీడలు ఆశించాయి. నివారణ కోసం రైతులకు సూచనలు, సలహాలు అందజేశాం. నీటితడులు అందిన పొలాలకు ఎలాంటి ఢోకా లేదు. పంట దిగుబడి సరిగానే వచ్చే అవకాశాలున్నాయి.

– ఎల్తూరి సురేఖ, ఏడీఏ, బెల్లంపల్లి

పత్తి సేకరణలో కూలీల నిమగ్నం..

వరికోతలకు యంత్రాలు ఉపయోగపడుతుండటంతో కూలీలు పత్తి సేకరణకు వెళ్తున్నారు. గ్రామాలవారీగా కూలీలు పత్తి ఏరే పనులు చేస్తున్నారు. పట్టణాల నుంచి ప్రత్యేక వాహనాల్లో రప్పించి పత్తి సేకరణ చేయిస్తున్నారు. ప్రస్తుతం పత్తి కొనుగోళ్లు ప్రారంభం కావడంతో మహిళ కూలీలకు చేతినిండా పని దొరుకుతోంది. అలాగే పురుషులు వరికోతల పనుల్లో నిమగ్నమయ్యారు.

ఆరు గ్యారంటీలు అమలు చేస్తాం

- కాంగ్రెస్ మంచిర్యాల అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు



దండేపల్లి: వెల్గనూర్ ప్రచారసభలో మాట్లాడుతున్న ప్రేంసాగర్‌రావు

దండేపల్లి: కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలను అధికారం చేపట్టిన వంద రోజుల్లో అమలు చేస్తోందని ఆ పార్టీ మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి కొక్కిరాల ప్రేంసాగర్‌రావు చెప్పారు. మండలంలోని కాసిపేట, వెల్గనూర్, నంబాల, గూడెం గ్రామాల్లో సోమవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు ప్రేంసాగర్‌రావుకు స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రచార సభల్లో ప్రేంసాగర్‌రావు పాల్గొని ప్రసంగించారు. నియోజకవర్గ ప్రజలకు సేవ చేసేందుకు నాకు ఒక్క అవకాశమిచ్చి చేతి గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. జిల్లా నాయకుడు త్రిమూర్తి, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సర్పంచులు శంకరయ్య, పుష్పలత, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

'ప్రేమ్‌సాగర్‌రావు గెలుపు ఖాయం'

మంచిర్యాలటౌన్: కాంగ్రెస్ మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేంసాగర్‌రావుకు మద్దతుగా మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ చదివిన పూర్వ విద్యార్థులు సోమవారం ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయన విజయానికి పూర్వ విద్యార్థులందరూ కలిసికట్టుగా పనిచేస్తారని, వచ్చే ఎన్నికల్లో ఆయన గెలుపు ఖాయమన్నారు. జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సిరిపురం రాజేశ్, పూర్వవిద్యార్థులు మద్దిశెట్టి సూరి, పి.అనిల్‌కుమార్, చంద్రశేఖర్, బలభద్రపాత్రుని శంకర్రావు, ప్రసాద్, హేమచందర్, బెంజమిన్ ఫ్రాంక్లిన్, సూర్యప్రకాశ్, యుగంధర్, ఇజాద్ అహ్మద్, శ్రీరామోజు నాగేందర్, బి.సత్యనారాయణ, జితేందర్‌రావు, జగన్‌మోహన్‌రావు, షాహిద్, గట్టు స్వామి, బొడ్డు శంకర్ పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

మంచిర్యాలటౌన్: రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని కాంగ్రెస్ మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. జిల్లాకేంద్రంలోని 5వ వార్డు చున్నంబట్టి వాడ, సాయికుంటలలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధి, సంక్షేమంపైనే దృష్టిసారించిందన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో అభివృద్ధిలో వెనుకబడిందని అన్నారు. ప్రజలు ఈ ఎన్నికల్లో చేయి గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

'నిస్వార్థంగా సేవ చేస్తా'

నస్పూర్: ప్రజలకు నిస్వార్థంగా సేవ చేయడానికే రాజకీయాల్లోకి వచ్చానని కాంగ్రెస్ మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి ప్రేంసాగర్‌రావు తెలిపారు. సోమవారం ఆయన రాయల్‌గార్డెన్ వద్ద గ్రౌండ్‌లో నిర్వహించిన 1, 2, 22 వార్డుల కార్యకర్తల సమావేశంలో డీసీసీ అధ్యక్షురాలు సురేఖతో కలిసి పాల్గొని మాట్లాడారు. ఎమ్మెల్యే దివాకర్‌రావు కమీషన్లకు కక్కుర్తి పడి పట్టణ అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. తనను గెలిపిస్తే కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని హామీఇచ్చారు. పట్టణంలోని డంప్‌యార్డు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తామన్నారు. సీసీసీ టౌన్ శిప్‌కు చెందిన ఆటో యూనియన్ సభ్యులు ఆయనకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు సుధాకర్, నాయకులు వేణు, గెల్లు మల్లేశ్, పాల్గొన్నారు.



ప్రజలతో కలిసి నినాదాలు చేస్తున్న ప్రేమ్‌సాగర్‌రావు

కేసీఆర్‌తోనే సింగరేణికి భవిష్యత్

- బీఆర్‌ఎస్ మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు



మాట్లాడుతున్న దివాకర్‌రావు

శ్రీరాంపూర్: సీఎం కేసీఆర్‌తోనే సింగరేణికి భవిష్యత్ ఉందని బీఆర్‌ఎస్ మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు అన్నారు. సోమవారం శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిపై నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడారు. ఇన్నాళ్లు కాపాడుకున్న సింగరేణి ఇక ముందు కూడా నిలువాలంటే మరోసారి సీఎంగా కేసీఆరే ఉండాలన్నారు. సింగరేణిలో బొగ్గు బ్లాక్‌లను ఇటీవల బీజేపీ ప్రైవేట్ పరం చేయాలని చూస్తే కేసీఆర్ అడ్డుకున్నారని తెలిపారు. రాష్ట్రంలో మరే సర్కారు ఉన్నా సింగరేణి ప్రైవేట్ పరమవుతుందన్నారు. కార్మికులకు కారుణ్య ఉద్యోగాలను కల్పించింది కేసీఆరేనన్నారు. కోలిండియాలో లేని అనేక హక్కులను కార్మికులకు కల్పించారన్నారు. పెర్క్స్‌పై పడే ఆదాయ పనులను ప్రభుత్వమే చెల్లిస్తోందని కేసీఆర్ మందమర్రి ఎన్నికల సభలో హామీ ఇచ్చారని గుర్తుచేశారు. మరోసారి మంచిర్యాలలో గులాబీ జెండా ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు బి.వెంకటరావు, శ్రీరాంపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షులు డి.అన్నయ్య, మంద మల్లారెడ్డి, చర్చల ప్రతినిధులు ఏనుగు రవీందర్‌రెడ్డి, పెట్టం లక్ష్మణ్, వెంగళ కుమారస్వామి, నాయకులు వెంకటరెడ్డి, జక్కుల రాజేశం, మైపాల్‌రెడ్డి, అన్వేష్‌రెడ్డి, సత్యనారాయణ, ఫిట్ సెక్రటరీ కందుల శంకరయ్య పాల్గొన్నారు.

అభివృద్ధి చేశా..ఆదరించండి

దండేపల్లి: మంచిర్యాల నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశాను, ఆదరించి మళ్లీ గెలిపిస్తే మరింత అభివృద్ధి చేస్తానని బీఆర్‌ఎస్ మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి ఎమ్మెల్యే దివాకర్‌రావు అన్నారు. మండలంలోని చింతపల్లిలో సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటా తిరిగి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం గ్రామ కూడలి వద్ద ప్రజలనుద్దేశించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ హయాంలో అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయన్నారు. మళ్లీ ప్రభుత్వాన్ని అధికారంలోకి తేవాలని కోరారు. డీసీఎంఎస్ చైర్మన్ లింగయ్య, రైతుసమితి జిల్లా కన్వీనర్ గురువయ్య, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను చూసి ఓటేయండి

మంచిర్యాలటౌన్: రాష్ట్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను చూసి ప్రజలు మరోసారి కారు గుర్తుకు ఓటేయాలని బీఆర్‌ఎస్ మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు కోరారు. జిల్లాకేంద్రంలోని 36వ వార్డులో సోమవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను వివరించారు. బీఆర్‌ఎస్‌ని గెలిపిస్తే, ఆయా సంక్షేమ ఫలాలు అందుతాయని తెలిపారు. 29వ వార్డు కౌన్సిలర్ చైతన్యరెడ్డి, అత్తి సరోజ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వాహనాల తనిఖీ



తనిఖీ చేస్తున్న సీఐ మహేందర్‌రెడ్డి

కాసిపేట: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాసిపేట పోలీస్‌స్టేషన్ పరిధి చొప్పరిపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సోమవారం ఉదయం మందమర్రి సీఐ మహేందర్‌రెడ్డి వాహనాల తనిఖీ చేశారు. సీఆర్పీఎఫ్ మహిళా బెటాలియన్‌తో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో విధి నిర్వహణను పరిశీలించారు. పోలీస్ సిబ్బంది, టీం ఇన్‌చార్జి పాల్గొన్నారు.

అనారోగ్యంతో కార్యదర్శి మృతి



రాజేశ్వరి(ఫైల్)

జన్నారం: మండలంలోని చింతగూడ గ్రామ కార్యదర్శి గుర్రపు రాజేశ్వరి (38) అనారోగ్యంతో మృతిచెందింది. కుటుంబీకులు తెలిపిన వివరాలు.. జన్నారం గ్రామానికి చెందిన గుర్రపు నర్సయ్య, లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె రాజేశ్వరి. 2014లో కార్యదర్శిగా నియామకం అయ్యారు. చింతగూడలో ప్రస్తుతం పనిచేస్తున్నారు. రాజేశ్వరి గతేడాది అనారోగ్యానికి గురవడంతో ఆసుపత్రిలో పరీక్ష చేసుకోగా క్యాన్సర్ అని తేలింది. చికిత్స పొంది మూడునెలల క్రితం తిరిగి విధుల్లోకి హాజరయ్యారు. ఈనెల 18న అనారోగ్యానికి గురైన ఆమెను ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు తెలిపారు.

అధికారులకు శిక్షణ

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సెక్టోరియల్ అధికారులకు ఆర్వో సిడాం దత్తు సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈవీఎంలకు బ్యాలెట్ పేపర్లు ఎలా పెట్టాలి, వాటిని ఎలా ముగించాలనే వివరాలను తెలియజేశారు. చెన్నూర్, మందమర్రి మండలాల తహసీల్దార్లు మల్లికార్జున్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో విజ్ఞానం

బెల్లంపల్లి: ఓ ఉత్తమ పుస్తకం మానవ జీవితాన్ని ఎంతగానో ప్రభావితం చేసి దిక్సూచిగా నిలుస్తోందని బెల్లంపల్లి ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ కళాశాల ప్రిన్సిపాల్ ఐనాల సైదులు అన్నారు. కళాశాలలో సోమవారం గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. పుస్తక పఠనంతోనే విజ్ఞానం పెరుగుతుందని, జ్ఞాన సముపార్జనకు పుస్తకాలు ఎంతో దోహదపడుతాయన్నారు. విద్యార్థులు గ్రంథాలయాన్ని సందర్శించడం, మంచి పుస్తకాలు చదవడం అలవాటుగా చేసుకోవాలన్నారు. మహానుభావుల జీవిత చరిత్రలను అధ్యయనం చేయాలని సూచించారు. గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని నిర్వహించిన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతకుముందు అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది బాలల హక్కులను పరిరక్షిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎండీ కౌసర్, ఆర్ట్ ఉపాధ్యాయుడు అశోక్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



చిత్రకళను వివరిస్తున్న ఉపాధ్యాయుడు

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు పరిశీలన

జన్నారం: మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను సోమవారం సాయంత్రం జనరల్ అబ్జర్వర్ కె.గోపాలకృష్ణన్ పరిశీలించారు. పొనకల్, దొంగపల్లి, హాస్టల్‌తండా, లోత్రొర్రె, బాదంపల్లి, రేండ్లగూడ, కలమడుగు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించి ప్రజలతో మాట్లాడారు. అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్సై సతీశ్, ఎంపీడీవో అరుణరాణి, ఆర్‌ఐ భానుచందర్ తదితరులు ఉన్నారు.



పొనకల్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న పరిశీలకులు

బాలల హక్కులపై అవగాహన

నెన్నెల: బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని కుశ్నపల్లి ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు బాలల హక్కులు, వివిధ చట్టాలపై డయాసిస్ ఆఫ్ ఆదిలాబాద్ ఉమెన్ ప్రమోషన్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. కోఆర్డినేటర్లు సత్యనారాయణ, దేవదాస్ మాట్లాడుతూ ఒకటి జీవించే హక్కు, రెండు అభివృద్ధి చెందే హక్కు, మూడు రక్షణ పొందే హక్కు, నాలుగు భాగస్వామ్య హక్కు ఈ నాలుగింటిని వివరించారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలన్నారు. పాఠశాలలో కూరగాయల సాగు కోసం సంస్థ తరఫున విత్తనాలు అందజేశారు. సభ్యుడు శేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ సత్యం

అవకాశమిస్తే సేవకుడిలా పని చేస్తా

- ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్

ఇంద్రవెల్లి: అవకాశం ఇవ్వండి.. సేవకుడిలా పని చేస్తానని ఖానాపూర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి భూక్య జాన్సన్‌నాయక్ అన్నారు. సోమవారం జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌తో కలిసి మండలంలోని గిన్నేర, బిక్కుతండా, శంకర్‌గూడ, చిన్న దనోర, దనోర గ్రామాలతో పాటు మండల కేంద్రంలోని భీంనగర్, ప్రబుద్ధనగర్, బుద్ధనగర్‌లో ప్రచారం చేశారు. పలువురు బీఆర్‌ఎస్‌లో చేరగా.. కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఉట్నూర్ జెడ్పీటీసీ రాథోడ్ చారులత, జెడ్పీ చైర్మన్ మహ్మద్ అంజద్, జాదవ్ శ్రీరాంనాయక్, మీర్జా జీలానిబేగ్, లఖన్, సుఫీయన్, కోవ రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్ గెలుపే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేయాలని జెడ్పీ చైర్మన్ జనార్దన్ రాథోడ్ అన్నారు. సోమవారం మండలంలోని కుమ్మరితండా గ్రామంలో ప్రచారం చేశారు. వైస్ ఎంపీపీ బాలాజీ, జెడ్పీటీసీ చారులత రాథోడ్, శ్రీరాంనాయక్, ధరణి రాజేశ్ పాల్గొన్నారు.



ఇంద్రవెల్లి: పార్టీలోకి ఆహ్వానిస్తున్న జాన్సన్‌నాయక్

ఖానాపూర్: ఖానాపూర్ ఎమ్మెల్యేగా జాన్సన్‌నాయక్‌ను గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకులు సోమవారం పట్టణంతోపాటు మండలంలోని ఆయా గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు అందజేశారు.

పెంబి: మండలంలోని ఇటిక్యాల్, కిష్టునాయక్‌తండా గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ మేనిఫెస్టో, ప్రవేశపెట్టిన పథకాలు ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నరేందర్ రెడ్డి, జెడ్పీటీసీ జానుబాయి తదితరులున్నారు.

సినీ యాక్టర్ల ప్రచారం

ఇంద్రవెల్లి: మండల కేంద్రంలోని వారసంతలో జాన్సన్‌నాయక్ తరుపున తెలుగు సినీ యాక్టర్లు ప్రచారం చేశారు. హీరో గోపీచంద్ నటించిన యజ్ఞం సినిమాలో విలన్‌గా నటించిన విజయరంగరాజ్, ప్రొడ్యూసర్ బాలరాజుగౌడ్, తమిళ్, కన్నడ భోజపురి, తెలుగు సినిమాల్లో నటించిన రియల్ స్టార్ ఆజాద్ ప్రచారం చేశారు.

స్థానికుడిగా అవకాశం ఇవ్వండి

- బీజేపీ చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్



చెన్నూర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



పొనూర్‌లో మాట్లాడుతున్న బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్

జైపూర్: స్థానికుడిగా ప్రజాసేవే లక్ష్యంగా రాజకీయాల్లో వచ్చాను ఒక్కసారి ఎమ్మెల్యేగా అవకాశమిస్తే ప్రజలకు సేవ చేస్తానని బీజేపీ చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్ పేర్కొన్నారు. జైపూర్ మండలంలోని పొనూర్ గ్రామంలో సోమవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ చేసిన అభివృద్ధి, మేనిఫెస్టోని వివరించారు. ఉపాధ్యాయుడిగా పనిచేసిన తనకు ఇక్కడి ప్రాంత ప్రజల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తిగా తనకు అవకాశం ఇవ్వాలని కోరారు. నియోజకవర్గ ప్రజలు కమలం పువ్వు గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు.

బీజేపీ ఇంటింటా ప్రచారం

చెన్నూర్: బీజేపీ చెన్నూర్ ఎమ్మెల్యే అభ్యర్థి దుర్గం అశోక్‌ను గెలిపించాలని కోరుతూ పట్టణంలో బీజేపీ నాయకులు ఇంటింటా ప్రచారం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, బీజేపీ మేనిఫెస్టోను వివరిస్తూ ప్రచారం నిర్వహించారు. నాయకులు వెంకటేశ్వర్‌గౌడ్, మహేశ్, రాపర్తి వెంకటేశ్వర్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

గుండెజబ్బులకు దూరంగా ఉండాలి

శ్రీరాంపూర్: గుండెజబ్బులకు దూరంగా ఉండాలని సింగరేణి హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ లోకనాథ్‌రెడ్డి తెలిపారు. శ్రీరాంపూర్ డివిజన్‌లోని ఆర్కే 5 గనిలో గుండె జబ్బులపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీరోజు పీచు పదార్థాలు, అధిక ప్రోటీన్ ఆహారం, ఆకుకూరలు తాజా పండ్లు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగులకు బీపీ, షుగర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. గని మేనేజర్ సాయిప్రసాద్, రక్షణ అధికారి రవిశంకర్, అండర్ మేనేజర్‌లో రవీందర్, వెంకట్రాజం, లక్ష్మణ్, శశాంక్, గని ఇంజనీర్ సుధీర్‌రెడ్డి, వెంటిలేషన్ అధికారి జగదీశ్వరరావు, సంక్షేమ అధికారి సంతన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నెన్నెల: మండలంలోని గొల్లపల్లికి చెందిన బీఆర్‌ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు లింగంపల్లి రాజం తల్లి ఎల్లక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సోమవారం వారి ఇంటికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మండల అధ్యక్షుడు సాగర్‌గౌడ్, సర్పంచ్ ఇందూరి శశికళ, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందూరి రమేశ్, కార్యకర్తలు ఉన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

భీమారం: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పలువురు సోమవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. రాష్ట్ర నాయకుడు చెర్కు సరోత్తంరెడ్డి వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైస్ ఎంపీపీ జనంపల్లి సమ్మయ్య, సర్పంచ్ గోదారి తిరుపతి పాల్గొన్నారు.

సాక్షి
దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899